పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదం

- వర్షాకాలంలో విద్యుత్ సరఫరా సమస్యలకు అవకాశం
- అధికారుల సూచనలు పాటించాలి
- జూలై 2 వరకూ జాతీయ విద్యుత్ వారోత్సవాలు


2021 డిసెంబర్ 13న అచ్యుతాపురంలో చేతి పంపునకు విద్యుత్ ప్రవహించడంతో మృతి చెందిన రైతు (ఫైల్)


అంగరలో విద్యుత్ స్తంభంపై లైటును అమర్చుతున్న కార్మికుడు

కపిలేశ్వరపురం: వర్షాకాలం విద్యుత్ ప్రమాదాలు పొంచి ఉంటాయి. ఏమరుపాటుగా ఉంటే ఏ క్షణాన ఏమైనా జరగొచ్చు. విద్యుత్ వినియోగంపై అవగాహన అవసరం. ఈనెల 26 జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలు ప్రారంభ మయ్యాయి. జూలై 2 వరకూ వారోత్సవాలు కొనసాగనున్నాయి.

అవగాహన కార్యక్రమాలు ఇలా...

ఈనెల 26 నుంచి జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ భద్రతపై పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. విద్యుత్ భద్రతను స్వీకరించి జీవితాలను రక్షించండి అనే నినాదంతో వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. విద్యుత్ భద్రతా సంచాలకుల శాఖలోని ఫీల్డ్ సిబ్బంది తమ అధికార పరిధిలో ఉన్న పాఠశాలలు, పరిశ్రమలు, ఆసుపత్రులు, సినిమా హాళ్లు, అపార్ట్‌మెంట్లు, షాపింగ్‌మాల్స్ మొదలైన వాటిలో విద్యుత్ భద్రతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల తర్వాత విద్యుత్ ప్రమాదాలే అధికం

ప్రమాదంలో ఓ వ్యక్తి ప్రాణాలు పోగొట్టుకుంటే ఆ కుటుంబం వీధిన పడుతుంది. దేశంలో రోడ్డు ప్రమాదాలు మొదటి స్థానంలో ఉండగా ఆ తర్వాత విద్యుత్ ప్రమాదాలు అధికంగా నమోదవుతున్నాయి. ఈ విషయాన్ని జాతీయ నేర గణాంక సంస్థ నిర్ధారించింది. 2022లో దేశంలో 12,200 మంది విద్యుత్ ప్రమాదాలకు గురయ్యారు. 2011 -2021 మధ్య సుమారు లక్షకుపైగా జనం విద్యుత్ ప్రమాదాలకు గురయ్యారు. గతేడాది కాజులూరు మండలం బంధనపూడి శివారు మొగలలిపాలెంలో కె.సుబ్బారావు (88) ఈదురుగాలులకు నేలరాలిన కొబ్బరి కాయలు, ఆకులను సేకరిస్తుండగా తెగిపడిన విద్యుత్ తీగ తగిలి చనిపోయారు. కపిలేశ్వరపురం మండలం తాతపూడిలో కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు కొనసాగుతుండగా విద్యుత్ తీగ తగిలి మేస్త్రి మృతి చెందాడు. 2021 డిసెంబర్ 13న కపిలేశ్వరపురం మండలం అచ్యుతాపురానికి చెందిన వ్యవసాయ కూలి కొమ్మరి సత్యనారాయణ (53) చేతి పంపునకు విద్యుత్ ప్రవహించడంతో దాన్ని తాకి మృతి చెందాడు. ముమ్మిడివరం మండల అన్నంపల్లిలో నీళ్లు తాగేందుకు వెళ్తున్న పాడి గేదె ట్రాన్స్‌ఫారం వద్ద విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడింది. పిఠాపురం మండలం గోకివాడలో ఈ ఏడాది మే 24న కాలువలో పిడుగుపడగా పాడి గేదె మృతి చెందింది.

వ్యవసాయ క్షేత్రాల్లో ఏమరుపాటు తగదు

విశాల వ్యవసాయ క్షేత్రంలో వర్షాకాలం రక్షణ అవకాశాలు తక్కువ ఉంటాయి. అకస్మాత్తుగా వర్షం వస్తే చెట్టు నీడ లేదా పశువుల పాకల వద్దకు చేరతారు. ఆ ప్రదేశాల్లో విద్యుత్ వైర్లు ఉంటే ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయి. పిడుగు పాటుకు వ్యవసాయ రైతులు, కూలీలు, పాడి గేదెలు మృతి చెందిన ఘటనలు అనేకం ఉన్నాయి. విద్యుత్ మోటారు స్విచ్‌లు ఆన్, ఆఫ్ చేసేటప్పుడు ప్రమాదాలు జరిగిన సందర్భాలున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు సూచించిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవాలి. వర్షాలు పడుతున్నప్పుడు గోడలు, నేల విద్యుత్ స్తంభాలు తేమతో నిండి ఉంటాయి. విద్యుత్ లైన్‌కు అనుకుని ఉన్న స్తంభాల నుంచి నేలకు, గోడలకు ఇతర వస్తువులకు విద్యుత్ ప్రవహించి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్నాయి.

వ్యవస్థీకృత సమస్యలు అనేకం

విద్యుత్ శాఖ అధికారుల పర్యవేక్షణలో కిందిస్థాయి ఉద్యోగులు, సిబ్బంది విధులను నిర్వహిస్తుంటారు. వారి మధ్య సమన్వయం లోపించినప్పుడు క్షేత్ర స్థాయి సిబ్బంది ప్రాణాలను కోల్పోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. సాధారణంగా విద్యుత్‌లైన్ల నిర్మాణ పనులు ప్రైవేటు వ్యక్తులు చేస్తున్నారు. స్తంభాలు ఏర్పాటు, అమరిక పనులు సైతం ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం ఉంటుంది. విద్యుత్ శాఖ అధికారుల పర్యవేక్షణ ఉన్నప్పటికీ నిర్లక్ష్యం వహించడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. క్షేత్ర స్థాయిలో సబ్ స్టేషన్ల బ్రేకర్లు, ఏబీ స్విచ్‌లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు నిర్వహణ సక్రమంగా నిబంధనల మేరకు, ఉద్యోగుల సమన్వయంతో చేపట్టాల్సి ఉంది. ఎర్తింగ్ సరిగ్గా లేకపోయినా ప్రమాదాలు నమోదయ్యే అవకాశాలున్నాయి. తీగలు వేలాడటం, ఒక స్తంభానికి ఒకే ఫీడర్ వైర్లు ఉండాల్సి ఉన్నప్పటికీ వేర్వేరు ఫీడర్ల వైర్లను అమరచడం లాంటివి సమస్యలకు కారణమవుతున్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- విద్యుత్ తీగలను ఆన్చుతూ ఎలాంటి వస్తువులను చేర్చవద్దు.
- విద్యుత్ తీగలను ఇతర తీగలతో కలపనీయరాదు. సపోర్ట్ వైర్లుగా ఇన్సులేటెడ్ వైర్లను ఉపయోగించాలి.
- ఓల్టేజీలో హెచ్చు తగ్గులు ఉన్నా, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శబ్దం వస్తున్నా వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి.
- చెట్ల కొమ్మలు తీగలను, స్తంభాలను విద్యుత్ తీగలు తాకుతుంటే ముందస్తుగా విద్యుత్ శాఖ అధికారులకు సమాచారాన్ని అందించాలి.
- ఎవరికైనా విద్యుత్ షాక్ తగిలితే రక్షించాలన్న ఆతృతతో తాకరాదు. ముందస్తుగా బాధితుడిని తాకిన వైరును తొలగించాలి.
- వ్యవసాయ క్షేత్రాల్లో మోటార్‌ను ఆన్, ఆఫ్ చేసేటప్పుడు నేల తడిగా లేకుండా చూసుకోవాలి.
- తడిచేతులు, తడికాళ్లతో విద్యుత్ ఉపకరణాలను తాకరాదు.
- విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తితే ఆ శాఖ అధికారులకు తెలిపి సమస్యను పరిష్కరించుకోవాలి. సొంత ప్రయోగాలు చేయడం ప్రమాదకరం

భద్రతకు అధిక ప్రాధాన్యం

విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యంగా భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తున్నాం. అందుకు పెరిగిన సాంకేతికతను వినియోగిస్తున్నాం. అధికారులు, ఉద్యోగులు, క్షేత్ర స్థాయి సిబ్బంది మధ్య సమన్వయానికి ప్రాధాన్యతనిస్తున్నాం. విద్యుత్ కనెక్షన్‌ను ఇచ్చేముందు క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేస్తున్నాం. విద్యుత్ వారోత్సవాలు సందర్భంగా వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నాం.

– విజయానంద్, డీఈ, రామచంద్రపురం

షాపుల వేలంలో నిర్లక్ష్య వైఖరి తగదు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- మున్సిపల్ షాపుల అద్దె వసూళ్లు, బకాయిలపై చర్చ
- అధికారుల తీరుపై ఎమ్మెల్యే వేగుళ్ల ఆగ్రహం
- మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం


హాజరైన అధికార, విపక్ష, ఎక్స్‌అఫీషియో సభ్యులు


మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి

మండపేట: మండపేట మున్సిపాలిటీకి చెందిన షాపుల వేలంలో, అద్దె బకాయిల విషయంలో మున్సిపల్ అధికారులు తమ నిర్లక్ష్య వైఖరి విడనాడి చిత్తశుద్ధితో పని చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. కొత్త ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక తొలిసారిగా మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేగా అధికార పార్టీలో పదవీ బాధ్యతలు స్వీకరించిన వేగుళ్ల జోగేశ్వరరావు మొదటి సారిగా కౌన్సిల్ సమావేశానికి ఎక్స్ అఫీషియో సభ్యునిగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఎక్స్ అఫీషియో సభ్యునిగా సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజెండాలో పొందుపరిచిన 29 అంశాల్లో కొన్నింటికి ఆమోద ముద్ర వేశారు. ఈ సందర్భంగా పలు అంశాలు చర్చకు దారి తీశాయి. 20వ వార్డు గొల్లపుంత కాలనీలోని మూడు షాపుల్లో రెండు షాపులు గతేడాది నుంచి ఖాళీగా ఉన్నాయని, శుక్రవారం వాటికి వేలం నిర్వహించినట్టు ఆర్ఐ ప్రభాకర్ చౌదరి చెప్పగా దానిపై ఎమ్మెల్యే వేగుళ్ల ఆరా తీశారు. షాపులు ఖాళీగా ఎందుకు ఉంచారని, ఆ షాపుల తాళాలు ఎవరి వద్ద ఉన్నాయని ఆర్ఐ ప్రభాకర్‌ను నిలదీశారు. ఈ విషయంపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కూడా సమర్థిస్తూ సమాధానం కోరారు. ఏఈ పవన్‌కుమార్‌ను పరిశీలనకు పంపించగా ఖాళీగా ఉన్న షాపు వద్ద టెంట్ సామగ్రి ఉందని, ఇంకొక షాపునకు తాళం వేసి ఉందని ఆయన చెప్పారు. తాళాలు ఎవరి వద్ద ఉన్నాయని ఎమ్మెల్యే ప్రశ్నించగా అధికారులు మిన్నకుండి పోయారు. అక్కడి టెంట్ సామగ్రిని మున్సిపల్ కార్యాలయానికి తీసుకొస్తే ఆ షాపును వాడుకుంటున్న వ్యక్తిని గుర్తించవచ్చని తోట సూచించారు. దీనిపై ఎమ్మెల్యే వేగుళ్ల స్పందిస్తూ తనకు ఫోన్ కాల్ వచ్చిందని కొంత కాలంగా ఆ షాపులు వేలం నిర్వహించకుండా అనధికారికంగా మున్సిపాలిటీలోని ఓ అధికారి అద్దెకు ఇస్తున్నట్టు సమాచారం ఉందన్నారు. ఆ అద్దె ఎవరి జేబులోకి వెళ్తుందో తేలాల్సి ఉందన్నారు. దీనిపై తోట త్రిమూర్తులు మాట్లాడుతూ ఖాళీ షాపులను వేలం వేయకుండా, మున్సిపాలిటీకి ఆదాయం రాకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పద్ధతిగా లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ షాపుల అద్దెలు మార్కెట్లోని ప్రైవేట్ షాపులకంటే ఎక్కువగా ఉంటున్నాయని మూడో వార్డు కౌన్సిలర్ యరమాటి గంగరాజు తెలిపారు. ఏడిద, గుమ్మిలేరు రోడ్డు వెంట ప్రయాణికుల సౌకర్యార్థం యూరినల్ ట్యాంకులు నిర్మించాలని 29వ వార్డు కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ కోరారు. ఏడిద రోడ్డులోని యూరినల్ ట్యాంకులను వినియోగంలోకి తేవాలని కోరారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా పార్కులో సులభ్ కాంప్లెక్స్ ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉందని గంగరాజు తెలియజేయగా మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని చైర్‌పర్సన్ దుర్గారాణి ఆదేశించారు. వాటర్‌వర్క్స్ వేలం అంశంపై చర్చ సాగింది. వాటర్‌వర్క్స్ పరిధిలోని చెట్ల పాటదారుడు గంగుమళ్ల శ్రీనివాస్ బకాయిపై ఎమ్మెల్యే వేగుళ్ల ప్రశ్నించారు. ఇదే అంశంపై వైస్‌చైర్మన్ వేగుళ్ల నారాయణరావు స్పందిస్తూ మూడు నెలలుగా వచ్చిన చెట్ల ఫలసాయం ఏమైందని ప్రశ్నించారు. దానికి అధికారులు మాట్లాడుతూ పాటదారులు ఎవరూ వేలానికి చొరవ చూపించడం లేదని సమాధాన మిచ్చారు. అనంతరం అజెండాలోని పలు అంశాలకు చైర్‌పర్సన్ దుర్గారాణి ఆమోదముద్ర వేశారు. సమావేశంలో కమిషనర్ బొడ్డేపల్లి రాము, వైస్‌చైర్మన్లు వేగుళ్ల నారాయణ రావు, పిల్లి గనేశ్వరరావు, కౌన్సిలర్లు, డీఈ కింతాడ శ్రీనివాస్, ఏఈలు డి పవన్‌కుమార్, కేవీవీ సత్యనారాయణ, మేనేజర్ పి కనకరాజు, ఆర్వో జేవీఎస్ శాస్త్రి, శానిటరీ ఎన్‌స్పెక్టర్ పి లావణ్య, టీపీవో ఎస్ సుప్రియ, టిడ్కో ఏఈ, టిడ్కో వర్క్ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలంతా బడికి వెళ్లాలి


పాణింగపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కె.గంగవరం: బడి ఈడు బాలబాలికలంతా బడికి వెళ్లడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సీనియర్ హెచ్ఎం పుల్లయ్య అన్నారు. మండలంలోని పాణింగపల్లిలో శనివారం బడికి పోదాం ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బాలబాలికలు బడిలో ఉండాలని, బట్టీల వద్ద, వ్యవసాయ పనుల వద్ద ఎవరూ ఉండటానికి వీల్లేదని తెలిపారు. ఆ మేరకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఉత్తర్వులు జారీ అయ్యాయని, తల్లిదండ్రులు ఒప్పించి పాఠశాలలో చేర్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు, ప్రజాప్రతినిధులపై ఉందని తెలిపారు. గ్రామంలో బడికి పోకుండా తిరుగుతున్న బాలబాలికలను, పనులకు పోతున్న వారిని గుర్తించి నూరు శాతం అడ్మిషన్లు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల కోసం ఉచిత పుస్తకాలు, కిట్లతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అందజేస్తోందని తెలిపారు. డ్రాపవుట్ లేకుండా చూడడమే ప్రథమ లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆయన చెప్పారు. ఉపాధ్యాయులు దుర్గాదేవి, సుబ్రహ్మణ్యం, వెంకటలక్ష్మి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 90 కేసుల పరిష్కారం


లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

రామచంద్రపురం: స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన నేషనల్ లోక్ అదాలత్‌లో 90 కేసులు పరిష్కరించినట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. వీటిలో 21 సివిల్ కేసులు, 56 క్రిమినల్ కేసులు, 6 బీఎస్ఎన్ఎల్ పిటిషన్లకు సంబంధించిన మొత్తం రూ.2 కోట్ల 36 లక్షల 43 వేల 859 విలువైన కేసులు పరిష్కారం అయ్యాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్, అడిషనల్ ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నాయక్, డీఎస్పీ బి.రామకృష్ణ, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పలివెల సత్యనారాయణ, సీఐ పి.దొరరాజు, ఎస్సై కె.సురేష్‌బాబు, లోక్ అదాలత్ సభ్యులు పీవీఎస్ జానకి, ఎస్‌బీఎస్‌కే కుమారస్వామి, చింతపల్లి శ్రీనివాసు, న్యాయవాదులు, లోక్‌అదాలత్ సిబ్బంది, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనది

అంబాజీపేట: రాజ్యాంగాన్ని అమలు పరుస్తున్న ఉన్నతాధికారుల నుంచి ప్రపంచ దేశాలను పాలిస్తున్న నేతల వరకు ఎంతో మందిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనదని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. గంగలకుర్రు అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ఆ నెల 30న ఉద్యోగ విరమణ చేస్తున్న ఖండవిల్లి శ్రీనివాస్ సన్మాన సభ శనివారం నిర్వహించారు. ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో విద్యార్థుల పట్ల అంకిత భావంతో పని చేసేవారికి ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ చేస్తున్న శ్రీనివాస్‌ను, ఈ ఏడాది మేలో ఉద్యోగ విరమణ చేసిన గణిత ఉపాధ్యాయుడు వేమూరి రూబేనులను పాఠశాల సిబ్బంది, స్థానికులు ఘనంగా సత్కరించారు.

శ్మశానాల అభివృద్ధితోనే పట్టణాభివృద్ధికి శ్రీకారం

మంత్రి వాసంశెట్టి సుభాష్


మంత్రి సుభాష్‌ను సత్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి, కమిషనర్ శ్రీనివాసులు

రామచంద్రపురం: శివ భక్తుడిగా పట్టణంలోని శ్మశానాల అభివృద్ధితోనే పట్టణాభివృద్ధికి శ్రీకారం చుట్టనున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన శనివారం నిర్వహించిన రామచంద్రపురం పురపాలక సంఘం సాధారణ సమావేశంలో ఎక్స్ అఫీషియో సభ్యుడి హోదాలో తొలిసారిగా పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ భోగాని శ్రీనివాసులు మంత్రి సుభాష్‌కు పుష్ప కిరీటం, బొకేలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్లు చింతపల్లి నాగేశ్వరరావు, కోలమూరి శివాజీ, వైఎస్సార్ సీపీ విప్ వాడ్రేవు సాయిప్రసాద్, కౌన్సిలర్లు మంత్రిని పరిచయం చేసుకున్నారు. కౌన్సిలర్లు బొక్కా సత్యనారాయణ, అంకం శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు అమృతవల్లి, మస్తాన్‌లు తమ పరిధిలోని శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి సుభాష్ తాను శివ భక్తుడిగా శ్మశానాల అభివృద్ధిపై దృష్టి పెడతానన్నారు. వాడ్రేవు సాయిప్రసాద్ మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డున ఉన్న పాత బస్టాండ్ వద్ద మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ శిథిలావస్థకు చేరిన కారణంగా దానిని కూల్చివేసి, నూతనంగా మల్టీప్లెక్స్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే మున్సిపాలిటీకి మంచి ఆదాయం వస్తుందని సూచించారు. దీనిపై మంత్రి సుభాష్ సానుకూలంగా స్పందించారు. అనంతరం 25 అంశాలతో కూడిన అజెండాలోని అంశాలను ఏకగ్రీవంగా కౌన్సిల్ ఆమోదించింది. తదనంతరం అత్యవసర సమావేశం నిర్వహించి మరో రెండు అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు.

ఉద్యోగ విరమణ చేసిన వారికి సత్కారం..

మున్సిపాలిటీలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన మల్లవరపు వెంకట్రావు, వీరకుమార్‌లను సతీ సమేతంగా మంత్రి సుభాష్ చేతుల మీదుగా సత్కరించారు.

అంకితభావంతో పని చేస్తే గుర్తింపు


ఉపాధ్యాయుడు రామకృష్ణారావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రాయవరం: అంకితభావం, నిబద్ధతో పని చేస్తే గుర్తింపు వస్తుందని ఎంఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని మాచవరం నంబర్-1 ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాకల వెంకటరామకృష్ణారావు పదవీ విరమణ సభ శనివారం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు రామలక్ష్మణమూర్తి, సూర్యనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు. ఉపాధ్యాయుడిగా అంకితభావంతో అందించే సేవలు కలకాలం గుర్తుంటాయన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు మేడపాటి నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు మేడిశెట్టి సత్యనారాయణ, ఎ.కృష్ణమోహన్, గుంటూరి అప్పారావు, వెలగల భామిరెడ్డి, యాకల విశ్వేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ 27 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తికి పూర్తి న్యాయం చేసిన రామకృష్ణారావు సేవలు పలువురికి స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు రామకృష్ణారావును దుశ్శాలువా, పూలమాలలు, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. అనంతరం పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు వాసంశెట్టి రాధాకృష్ణ, కలిశెట్టి శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పింఛన్ల పంపిణీకి సిద్ధమవుతున్న ఉద్యోగులు


ఓదూరులో పింఛన్ల పంపిణీకి నగదు సిద్ధం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలంలో 25 గ్రామాలకు మంజూరు చేయబడిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 10,628 మంది లబ్ధిదారులకు రూ.6,90,29,500 పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగుల ద్వారా జూలై 1న ఇంటింటికీ పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ ఎన్‌వీ రామచంద్రమూర్తి శనివారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు మండలంలోని అన్ని గ్రామా సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వృద్ధులు, వితంతువులు, చర్మకారులు, డప్పు కళాకారులు, నేత కార్మికులకు ఈ నెల నుంచి పెరిగిన పింఛన్ రూ.4 వేలు, గత నెల పింఛన్ రూ.3 వేలు కలిపి రూ.7 వేలు పంపిణీ చేసే విధంగా సిద్ధం చేసుకున్నారు. అదే విధంగా దివ్యాంగులకు పెరిగిన పింఛన్ రూ.6 వేలు అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కాజులూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య అన్నారు. శనివారం మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం, బందనపూడి తదితర గ్రామాల్లో ఆరోగ్యశాఖ సిబ్బంది పర్యటించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆర్యావటంలో డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ గ్రామాల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నందున అపారిశుధ్య వాతావరణం తలెత్తితే డయేరియా వ్యాపించేందుకు అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో ఎవరైనా జ్వరం, వాంతులు, విరేచనాలకు గురైతే డయేరియాగా గుర్తించి తక్షణమే చికిత్స నిమిత్తం వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ సిబ్బంది నరాళ రాజారావు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది వై.సోమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

హసన్‌బాదలో 'నేను బడికి పోతా' ర్యాలీ


హసన్‌బాదలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదలో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయిని పీఎస్‌బీఎస్‌కే సుందరి ఆధ్వర్యంలో 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. 6 నుంచి 14 సంవత్సరాల పిల్లలు అందరూ బడికి వెళ్లాలని అవగాహన కల్పించారు. పెళ్లికి ఎందుకు తొందర, చదువుకో ముందర, పనికి ఎందుకు తొందర, చదువుకో ముందర, పిల్లల చదువు, భవితకు వెలుగు తదితర నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీ వెంకన్నబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'వేగుళ్ల'కు కౌన్సిల్‌లో సత్కారం


వేగుళ్లను సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: నాల్గవసారి ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టి తొలి కౌన్సిల్ సమావేశానికి హాజరైన వేగుళ్ల జోగేశ్వరరావును పాలకపక్ష సభ్యులు ఘనంగా సత్కరించారు. శనివారం కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి సమావేశాన్ని ముగించిన అనంతరం ఎమ్మెల్యే వేగుళ్లకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో తొలుత ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దుశ్శాలువా కప్పి పూలమాల వేసి అభినందనలు తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ పాలకపక్ష సభ్యులంతా కలిసి ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్, టీడీపీ నాయకులు వుంగరాల రాంబాబు, సాధనాల చక్రపాణి, గుండు వీరతాతరాజు తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్లు పిల్లి గనేశ్వరరావు, వేగుళ్ల నారాయణరావు, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, పలువురు అధికారులు ఎమ్మెల్యేను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

వాడపల్లి వెంకన్న సన్నిధిలో కలెక్టర్ దంపతులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా దంపతులు స్వామి వార్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బాల్య వివాహాలను ప్రతిఘటించాలి


శలపాకలో బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ మాధవి

కాజులూరు: బాల్యవివాహాలను సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని తాళ్లరేవు ఐసీడీఎస్ సీడీపీఓ వి.మాధవి అన్నారు. శనివారం కాజులూరు, శలపాకలో ఐసీడీఎస్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సంయుంక్తగా కళాజాత నిర్వహించి బాల్యవివాహాల నిర్మూలన, అతిసార వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సీడీపీఓ మాధవి మాట్లాడుతూ బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. బాలలే నేటి జాతి సంపద, బాలికలను రక్షిద్దాం, బాలికలను చదివిదాం అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. గ్రామాల్లో 18 సంవత్సరాలు నిండకుండా బాలికలకు వివాహాలు జరిపిస్తున్నట్టు ఎవరి దృష్టికైనా వస్తే వెంటనే అధికారులకు, 1098కి ఫోన్‌లో సమాచారమివ్వాలన్నారు. చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఆధ్వర్యంలో కళాకారులు నాట్య రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.కనకరత్నం, యస్.మాణిక్యాంబ, స్కూల్ హెచ్ఎంలు పంపన కృష్ణమూర్తి, వి.శ్రీనివాసరావు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కైలాసభూమి నిర్మాణానికి రూ.58 వేల విరాళం

కొత్తపేట: స్థానిక తొగరిపాయ (సూర్యగుండాల రేవు) శ్మశాన స్థలం వద్ద కైలాసభూమి నిర్మాణానికి ప్రముఖ శిల్పి డి.రాజ్‌కుమార్‌వుడయార్ రూ.58 వేలు విరాళంగా అందజేశారు. రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం నాయకుడు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నంబూరి రెడ్డియ్య ఆధ్వర్యంలో గత కొన్నేళ్ల క్రితం కైలాసభూమి నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. భారీ బడ్జెట్ అంచనాతో సకల సౌకర్యాలతో కూడిన నిర్మాణం చేపట్టగా సుమారు 70 శాతం నిర్మాణం పూర్తయ్యింది. నిధుల లేమితో ఇంకా సుమారు 30 శాతం నిర్మాణం నిలిచిపోయింది. శవ దహనాలకు ఆ ప్రాంతం తీవ్ర అసౌకర్యంగా ఉండటంతో చాలా మంది తమ బంధువులు, కుటుంబ సభ్యుల పార్థివ దేహాలను ఎన్నో వ్యయ ప్రయాసలతో రాజమహేంద్రవరం కైలాసభూమికి తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. వెళ్లలేని వారు ఇక్కడే అసౌకర్యాల నడుమ నిర్వహిస్తున్నారు. దాంతో అసంపూర్తిగా నిలిచిపోయిన కైలాసభూమి నిర్మాణం పూర్తి చేయాలని పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. దానిలో భాగంగా శనివారం శిల్పి రాజ్‌కుమార్‌వుడయార్ తన విరాళాన్ని కైలాసభూమి నిర్మాత రెడ్డియ్యకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సలాది రామకృష్ణ, బొరుసు వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్, క్రాఫ్ట్, పీఈటీలను రెగ్యులర్ చేయాలి

అంబాజీపేట: సమగ్ర శిక్షలో 2012 నుంచి పనిచేస్తున్న పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్ (ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, పీఈటీ)లను రెగ్యులర్ చేయాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను కోరారు. తొండవరంలో ఎమ్మెల్యేను కలసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు మాట్లాడుతూ 2012 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో సమగ్ర శిక్ష కింద సుమారు 5 వేల మంది ఉపాధ్యాయులు రాష్ట్ర వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. మాకెవరికి ఇప్పటి వరకు ఉద్యోగ భద్రతలేదని, చాలీచాలని జీతాలతో జీవిస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటివి ఏవీ వర్తించడం లేదన్నారు. పార్ట్ టైమ్ పదం మార్చి ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్‌గా చేయాలని, కనీస వేతనంలో రూ.33 వేలు ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. తమ డిమాండ్‌లను రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించి సమస్యలు పరిష్కరించి తమను ఆదుకోవాలని కోరారు.